క్లుప్తంగా

క్రీడా ప్రాంగణం పరిశీలన



క్రీడాప్రాంగణం పరిశీలిస్తున్న తహసీల్దార్

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని తహసీల్దార్ సరిత బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. ఆమె వెంట సర్పంచ్ దాసరి చంద్రమౌళి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్ నెలవారి మరమ్మతు పనుల కారణంగా అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



మాట్లాడుతున్న సదాశివ్

తిర్యాణి: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంద్యాల సదాశివ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, ఎంఈవో పోస్టులతో పాటు డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జనార్దన్, జిల్లా కార్యదర్శి రాజేందర్, మండల అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను సంఘం జిల్లా కోకన్వీనర్ పత్తిపాక చంద్రశేఖర్ బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీఎస్‌యూటీఎఫ్ పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయులు వినేష్, ప్రశాంత్, అరుణ, లచ్చన్న, దివ్య, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల అరెస్టులు అన్యాయం'

ఆసిఫాబాద్‌రూరల్: డెయిలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లు పెండింగ్ వేతనాలు అడిగితే అరెస్టులు చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల పెండింగ్ వేతనాల కోసం శాంతియుతంగా భద్రాచలంలో ధర్నా చేస్తున్న కార్మికులను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. గిరిజన ఆశ్రమ హాస్టల్ డెయిలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్‌తో విద్యార్థులు

కెరమెరి: యాద శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఫౌండేషన్ చైర్మన్ సింగోష్టి బాబు పరీక్ష ప్యాడ్స్, నోట్‌బుక్స్ అందించారు. రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరైన వారికి క్యాష్ ప్రైజ్ కూడా అందించారు. విద్యార్థులు బాగా చదివి మంచి గ్రేడులు సాధించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆడే ప్రకాశ్, సంఘ సభ్యులు జీవన్, సమీర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాయితాడ్.. జంగుబాయి!

- ధనోరాలో ఆలయ వార్షికోత్సవం
- కొలాంల ఇంటిదేవతకు పూజలు
- తరలిరానున్న ఆదివాసీలు
- నేడు రాత్రి దీపోత్సవం



దేవతా విగ్రహాలు

కోర్కెలు తీర్చే తల్లిగా ఆదివాసీలు భావించే జంగుబాయి ఆలయ వార్షికోత్సవం మండలంలోని ధనోరా గ్రామంలో నేటి నుంచి జరుగనుంది. కొలాంల రాయితాడ్ (ఇంటి దేవత) జంగుబాయికి వందేళ్ల చరిత్ర ఉంది. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రకు చెందిన వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీ భక్తులు ఉత్సవాలకు తరలిరానున్నారు.

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో కొలాం ఆదివాసీలు జంగుబాయి ఉత్సవాలను పుష్యమాసం చివరి వారంలో నిర్వహిస్తుంటారు. ఏటా జరిగే ఈ వార్షికోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా కొలాం ఆత్రం వంశస్తులు ఇక్కడ ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు.



మొక్కులు తీర్చే పితృదేవతలు

ఉత్సవాలకు వందేళ్ల చరిత్ర

మండలంలోని ధనోరా గ్రామంలో నేటి నుంచి నిర్వహించే జంగుబాయి వార్షికోత్సవాలకు వందేళ్ల చరిత్ర ఉంది. ముక్కిలొంక, పార్డా గ్రామానికి చెందిన ఆత్రం లచ్చు జంగుబాయి భక్తుడు. ఆయన కలలోకి వచ్చిన దేవత తనను తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఆయురారోగ్యాలతో పాటు పంటల్లో అధిక దిగుబడులు, గ్రామంలో సుఖశాంతులు ఉంటాయని చెప్పినట్లు, దీంతో భక్తుడు వందేళ్ల క్రితం జంగుబాయి గుహలో వెలిగించిన దీపాన్ని తీసుకొచ్చి ఇక్కడ ఉత్సవాలు ప్రారంభించాడని భక్తుల విశ్వాసం. అప్పటి నుంచి పుష్యమాసం చివరి వారంలో దీపారాధన ప్రారంభించి వివిధ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నేడు రాత్రి 8 గంటలకు దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ప్రత్యేక పూజలు

నేడు రాత్రంతా కొలాం ఆదివాసీలు అమ్మకు ప్రత్యేక పూజలు జరుపుతారు. సాంప్రదాయ బద్ధంగా నృత్యాలు, భజనలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటారు. ఆత్రం గోత్రానికి చెందిన వారి జెండా ఎగురవేస్తారు. అనంతరం సమాధులకు పూజలు చేస్తారు. జంగుబాయి ఉత్సవాలను పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి, ఆసిఫాబాద్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లితో పాటు వివిధ జిల్లాల భక్తులు, మహారాష్ట్రలోని జివితి, అంభేర్థురి, సేడ్‌వాహి, తదితర గ్రామాలకు చెందిన కొలాం ఆదివాసీ భక్తులు భారీగా తరలిరానున్నారు.

కోరికలు నెరవేరుతాయి



రాయితాడ్ జంగుబాయి దేవతను మనస్సుతో పూజిస్తే సకలకార్యాలు నెరవేరుతాయి. అందుకు ప్రతీ ఏడాది ఆత్రం వంశస్తులు జంగుబాయి దేవతను ఇక్కడి గుడిలో పూజిస్తారు. భక్తిశ్రద్ధలతో అమ్మను పూజిస్తే కోరికలు నెరవేరుతాయని నమ్మకం.

– గంగు, పటేల్, కొలంగూడ

మహాసభలు జయప్రదం చేయండి

దహెగాం: ఈనెల 13, 14వ తేదీల్లో నిర్వహించే టీఎస్‌టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌టీయూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. బుధవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా జరిగే ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. రంగారెడ్డిలోని మన్నెగూడ బీఎంఎన్ కన్వెన్షన్ హాల్‌లో సభలు జరుగుతాయని తెలిపారున ముఖ్య అతిథిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరవుతారన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. సర్పంచ్ కావ్య మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రాగిజావ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భానుప్రకాష్, స్వతసాయి భజన మండలి కన్వీనర్ నరసింహచారి, ఉపాధ్యాయులు యాదగిరి, నగేష్, సుజాత, సమ్మయ్య, నగేష్, లక్ష్మి, కళావతి, శ్రీధర్, రమాదేవి, సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. రాగిజావతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో పోషకాలు అందుతాయని హెచ్‌ఎం గావుడే హన్మంతు అన్నారు. రాగిజావను విద్యార్థులు తప్పకుండా తాగాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: రాగిజావ పంపిణీ చేస్తున్న సిబ్బంది

అల్పాహారం అందించడం అభినందనీయం

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు ప్రతీరోజు అల్పాహారం అందించడం అభినందనీయమని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సర్పంచ్ బొమ్మెళ్ల పద్మ కిషన్ తన సొంత నిధులతో విద్యార్థులకు అల్పాహారం అందించారు. డీఈవో అశోక్, ప్రధానోపాధ్యాయులు హన్మంతు, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, నాయకులు పవిత్ర ధనరాజ్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు రాకేశ్, ప్రకాశ్, దివ్యశ్రీ, సత్యనారాయణ, రవికుమార్, మహిపాల్, గాయత్రి, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు

పల్లవి సేవలు మరువలేనివి

- డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం నాయక్

కౌటాల: మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించిన వైద్యురాలు జి.పల్లవి సేవలు మరువలేనివని డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదేళ్ల పాటు వైద్యురాలిగా సేవలు అందించిన పల్లవి ఉన్నత విద్యకోసం వెళ్తున్న క్రమంలో బుధవారం స్థానిక పీహెచ్‌సీలో అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పల్లవి మారుమూల ప్రాంతంలో పదేళ్ల పాటు అంకిత భావంతో సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, సర్పంచ్ వొజ్జల మౌనిక్, ఉపసర్పంచ్ తిరుపతి, వైద్యులు నవత, కిరణ్, నాయకులు మధుకర్, సురేష్, రామయ్య, వైద్య సిబ్బంది పావని, వర్ష, సునీత, సృజన, అనిత తదితరులు ఉన్నారు.



వైద్యాధికారి పల్లవి దంపతులను సన్మానిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం

ఇసుక ట్రాక్టర్ బోల్తా



ఇంటిగోడపై బోల్తా పడిన ట్రాక్టర్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయ సమీపంలో బుధవారం ఓ ఇంటి గోడపై ట్రాక్టర్ బోల్తా పడింది. పెద్దవాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న బొమ్మె మారుతి ప్రహరీ గోడపై బోల్తా కొట్టడంతో గోడ కూలింది. గోడ కూలడంతో నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంధన పొదుపు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సహజ వనరుల లభ్యత, వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏరియా జీఎం దేవేందర్ చేతుల మీదుగా బహుమతులు అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్లరెడ్డి, తాజోద్దీన్, నమత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గంగ స్నానానికి తరలివెళ్లిన పంద్రం వంశస్తులు



గంగస్నానానికి వెళ్తున్న పంద్రం వంశస్తులు

తిర్యాణి: మండలంలోని రోంపెల్లి గ్రామానికి చెందిన పెర్సపెన్ గంగస్నానం కోసం మంచిర్యాల జిల్లా దండెపెల్లి గ్రామంలోని గుడిరేవుకు పంద్రం వంశస్తులు బుధవారం తరలివెళ్లారు. అనంతరం గంగస్నానం చేశారు. ఆదివాసీ సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.రాం చందర్ బుధవారం తెలిపారు. ఈ నెల 6, 7, 8వతేదీల్లో తెలంగాణ అసోసియేషన్ ఫర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఫర్ ఆల్ నిర్వహించిన థర్డ్ తపీస రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ బహుమతి పొందారని, అథ్లెటిక్స్‌లో విద్యార్థులు ద్వితీయ బహుమతి పొందినట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పీఈటీ హరీశ్, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బెజ్జూర్: చదువుతో పాటు యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బెజ్జూర్ ఎస్సై వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని కోర్తేగూడ గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు వెళ్లకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో తులసీరాం, యువకులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై వెంకటేష్

'కళ్లు బాగుంటేనే ప్రపంచాన్ని చూడగలం'



కెరమెరిలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వర్

కెరమెరి: కళ్లు బాగుంటేనే ప్రపంచాన్ని చూడగలమని కంటి వెలుగు రాష్ట్ర నోడల్ అధికారి నగమల్లేశ్వర్ అన్నారు. బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కళ్లకు వెలుగు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 17 వరకు కొనసాగే కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో 26టీంలు, కెరమెరి మండలానికి 12టీంలు పని చేస్తాయన్నారు. వైద్యాధికారి వెంకటేశ్, సూపర్‌వైజర్ సూర్యకాంత, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేనీ, ఏఎన్‌ఎం, ఆశలు ఉన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ తిరుపతి రెడ్డి

'కంటి వెలుగు' పకడ్బందీగా చేపట్టాలి

బెజ్జూర్: ఈనెల 18 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మెడికల్ ఆఫీసర్ తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరికి కంటి వెలుగు ద్వారా నయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణ, వైద్యాధికారి సుంకన్న, హెల్త్ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

'గిరిజనుల భూముల జోలికొస్తే సహించం'



ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

కౌటాల: ఏజెన్సీ గ్రామాల్లోని ఆదివాసీల భూముల జోలికొస్తే సహించేది లేదని ఆదివాసీలు హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో 30 ఏళ్ల క్రితం కుమురంభీం మినీ స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపారన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 7న ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన 21మంది ఆదివాసీలపై తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకుడు కుమురం మాంతయ్య, మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారిపెల్లి పోశం, సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, నాయకులు పత్రు, ఎర్మ సుధాకర్, దిలీప్, విజయ్, పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: మహారాష్ట్రకు చెందిన నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చైర్మన్ హంసరాజ్ అహిర్‌ను బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని భాగ్యనగర్ కాలనీవద్ద పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. పార్టీ నాయకులు గణేశ్, పిడుగు పెంటయ్య, జయరాజ్, అర్జున్, ఫన్నీ, ప్రవీణ్, హమీద్, కిరణ్ తదితరులు ఉన్నారు.



హంసరాజ్ అహిర్‌తో నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉద్యోగులందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని డీవైసీఎంవో ఆర్.శౌరీ, హెల్త్ ఆఫీసర్ డి.లలిత అన్నారు. బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఉద్యోగులకు సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ఒక్కరి నిర్లక్ష్య పూరిత డ్రైవింగ్ మరో పది మంది ప్రయాణికుల పాలిట శాపంగా మారుతుందన్నారు. ఉద్యోగులు, కార్మికులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. మితిమీరిన వేగంతో వెళ్లొద్దన్నారు. చిన్నపిల్లలను బైక్ వెనుక కూర్చుబెట్టుకుని వాహనాలు నడపవద్దని సూచించారు. మెకడిల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ లలిత

కేజీబీవీలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థులకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వో నాగసుధ, ఐఈఆర్‌పీ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.